క్లుప్తంగా

బీజేపీ హ్యాట్రిక్ విజయం ఖాయం


సమావేశంలో మాట్లాడుతున్న సంగీత

యాలాల: కేంద్రంలో మరోమారు బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీత ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ మండల కార్యాలయాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కొండాకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరి, మాజీ సర్పంచ్ శివకుమార్, రవీందర్, జిల్లా నాయకులు రమేష్‌కుమార్, రజనీకాంత్, వెంకటేశ్, మండల ప్రధాన కార్యదర్శులు అరుణ్‌కుమార్, కాశీనాథ్, మధుగౌడ్ తదితరులు ఉన్నారు.

'కుంట పానాదిని బాగుచేయండి'

పెద్దేముల్: గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నాగిరెడ్డి కుంట పానాదిని బాగుచేయాలని మండల పరిధి జనగాం గ్రామ రైతులు కోరారు. కంప చెట్లతో పానాది మునుకు పోయి, రాక పోకలు ఇబ్బంది అవుతోందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి, పానాదిలో జంగల్ కటింగ్‌తో పాటు ఫార్మేషన్ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఇందులో రైతులు బాలప్ప, సంజీవ్, చంద్రప్ప, మల్లప్ప, లింగప్ప, రాములు యాదవ్, శంకర్, వెంకటప్పలు ఉన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. కోడ్ నేపథ్యంలో అక్రమంగా నగదు, మద్యం తరలించరాదని సూచించారు. ఒకవేల అధిక నగదును తీసుకెళ్తున్నట్లయితే.. తగిన పత్రాలను కలిగి ఉండాలని చెప్పారు. లేని యెడలా ఆ డబ్బును సీజ్ చేస్తామని వెల్లడించారు. ఈసీ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొడంగల్: కొడంగల్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా బూల్కాపూర్, చిట్లపల్లి, ఐనన్‌పల్లి, ఖాజా అహ్మద్‌పల్లి, మైసమ్మతండా, పోచమ్మ తండాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఏడీఈ నవీన్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతు, పరిధిలో చెట్ల నరికివేత తదితర పనుల వలన నియోజకవర్గంలోని దౌల్తాబాద్, దుద్యాల, బొంరాస్‌పేట సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు సరఫరాలో అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నేడు

తాండూరు: కాంగ్రెస్ తాండూరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ నెల 3న నిర్వహించిన సమావేశానికి కార్యకర్తలు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో నేడు మరోసారి నిర్వహించనున్నారు.

ఘనంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ


బోనాల ఊరేగింపు

చేవెళ్ల : శంకర్‌పల్లి మండల పరిధి ప్రొద్దుటూరు గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభ స్థాపన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి పూజలు కొనసాగాయి. సాయంత్రం బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. దీంతో గ్రామంలో పండగ వాతవారణం నెలకొంది. ఈ పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, నాయకులు ఉదయ్‌మోహన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు నర్సింహారెడ్డి, ఎంపీటీసీ ప్రవళిక వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌గౌడ్, సత్యం, మల్లయ్య, రంగారెడ్డి, నర్సింహ, బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు

- ఆరు నెలలైనా అందుబాటులోకి రాని ట్రాఫిక్ ఠాణా
- పెరుగుతున్న వాహనదారుల కష్టాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



తాళం వేసి ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్


ఠాణాను ప్రారంభించిన మంత్రులు, జిల్లా అధికారులు(ఫైల్)

తాండూరు: వ్యాపార కేంద్రమైన తాండూరు పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు శృతి మించాయి. వాహనదారులు, ప్రయాణికులు వాహన వలయంలో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. నియంత్రించే వారు లేక ప్రమాదాలకు పట్టణం నిలయంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. ట్రాఫిక్‌కు అడ్డుకట్ట వేసేందుకు గతేడాది సెప్టెంబర్‌లో నాటి మంత్రులు హరీశ్‌రావు, పట్నం మహేందర్‌రెడ్డిలు పోలీసు అధికారులతో కలిసి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. అయితే ప్రారంభించి 6 నెలలు దాటినా నేటికీ ఠాణా సేవలు అందుబాటులోకి రాలేదు.

పెరిగిన పట్టణ జనాభా

వాణిజ్య కేంద్రమైన తాండూరు దినదినాభివృద్ధి చెందుతోంది. రెండేళ్ల క్రితం వరకు 70 వేలు ఉన్న జనాభా.. ప్రస్తుతం లక్షకు చేరువైంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణం విస్తరిస్తోంది. వాహనాల సంఖ్య నానాటికీ పెరుగుతూ రోడ్లపై పరుగులు తీస్తున్నాయి. అంతే కాకుండా ఇతరత్రా పనులకోసం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు వేల సంఖ్యలో తాండూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. దాంతో ట్రాఫిక్ కష్టాలు అధికమవుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీంతో రోడ్డు దాటాలంటే భయమేస్తుందని, వాహనాల దూకుడుతో ఇబ్బంది పడుతున్నామని ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

ఈ సేవ భవనం.. ఠాణాకు కేటాయింపు

వాహనాల రద్దీ దృష్ట్యా.. నాటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు మున్సిపల్ ఆధీనం శాంతినగర్‌లోని ఈ సేవా భవనాన్ని పోలీసు శాఖకు బదలాయింపునకు కృషి చేశారు. ఇందులో ఠాణా ఏర్పాటుకు రూ.15లక్షలు మంజూరు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే స్టేషన్‌ను ప్రారంభించాలనే ఉద్దేశంతో పనులను పూర్తి చేశారు. గతేడాది సెప్టెంబర్‌లో నాటి మంత్రులు, హరీశ్, పట్నం ఎమ్మెల్యే పైలెట్, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డిలను ఆహ్వానించి ఠాణాను ప్రారంభించారు. కానీ.. ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు. ఇదిలా ఉండగా.. రూ.లక్షలు వెచ్చించి, అట్టహాసంగా ప్రారంభించిన ఠాణా భవనాన్ని ప్రజాసేవకు అందుబాటులోకి తీసుకురావడంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

'ఉపాధి'ని వినియోగించుకోండి

ఏపీఓ దస్తయ్య


కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ దస్తయ్య

దోమ: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ దస్తయ్య సూచించారు. శుక్రవారం మండల పరిధి బొంపల్లి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ.. ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిరికీ పని కల్పించాలనే ఉద్దేశంతో ఉపాధి పనులను చేపట్టిందని పేర్కొన్నారు. గతంలో రోజు వారి కూలి రూ.272 ఉండగా.. ప్రస్తుతం 300లకు పెంచిందని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పని ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్, టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లలాంటి తదితర సౌకర్యాలను కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే గెలుపు ఖాయం

మొయినాబాద్ రూరల్: నాయకులు, కార్యకర్తలు, బూత్‌స్థాయి అధ్యక్షులు సమష్టిగా పనిచేస్తే బీజేపీ గెలుపు ఖాయమని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం అన్నారు. శుక్రవారం మండల పరిధి అజీజ్ నగర్ చౌరస్తాలో గల పార్టీ కార్యాలయంలో బూత్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 14న మండల కేంద్రంలోని అంజనాదేవీ గార్డెన్‌లో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. గ్రామాల్లో పోలింగ్ బూత్ కేంద్రాల అధ్యక్షులు ఆయా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలను అభిమానులను పెద్ద సంఖ్యలో సమావేశానికి తరలించాలని ఆయన కోరారు. అదే విధంగా ఇంటింటికీ బీజేపీ ప్రచారాన్ని త్వరలో ప్రారంభిస్తారని వెల్లడించారు. దేశంలో మూడోసారి పీఎం మోదీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఆదివారం జరిగే సమావేశానికి ప్రతి ఒక్కరూ రావాలని పార్టీ శ్రేణులను ఉద్దేశించి చెప్పారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి రాజమల్లేశ్, నాయకులు రాజుగౌడ్, మాధవరెడ్డి, మహేందర్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్ జయంతి

- ఊరువాడా ఘనంగా నిర్వహించాలి
- వామపక్ష, ప్రజాసంఘాల పిలుపు


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

తాండూరు టౌన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని వామపక్ష, ప్రజా, మైనార్టీ సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏప్రిల్‌లో జాతీయ నాయకుల జయంతి కార్యక్రమాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 14న భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఊరువాడా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, అశోక్, అంజిలయ్య, బలరాం, రాములు, దాసు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- స్వచ్ఛందంగా చేరుతున్నారన్న ఎమ్మెల్యే

బషీరాబాద్: బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన మండల స్థాయి ముఖ్య నాయకులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులతో పాటు సుమారు 400 మంది కార్యకర్తలు శుక్రవారం మండల కేంద్రంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా అయినందున తాండూరు నుంచి 50వేలకు మించి మెజార్టీ ఇవ్వడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో.. బీఆర్ఎస్ మండల నాయకులు శంకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాణిక్‌రెడ్డి, వెంకటయ్య, జైపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీల బంటు రాజు, మాజీ సర్పంచ్‌లు సునిత, వసంత, నాయకులు దేవేందర్, రామకృష్ణ, వెంకట్ రెడ్డి, బసంత్, వెంకటయ్య, నర్సింలు, సూర్య నాయక్, నర్సిరెడ్డితో కార్యకర్తలు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, సీనియర్ నాయకులు బుయ్యని సత్యనారాయణ రెడ్డి, వెంకటేశ్ మహరాజ్, గిరిజాపూర్ మాధవరెడ్డి, మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మనుగడ కష్టమే..

ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మనుగడే కష్టమేనని ఎమ్మెల్యే బీఎమ్మార్ జోస్యం చెప్పారు. ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులై.. కారులో ఉన్నవారంతా స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో కొత్త, పాత అని తేడా లేకుండా సమష్టిగా లోకసభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కష్టపడిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత ఉంటుందని పార్టీ శ్రేణులను ఉద్దేశించి చెప్పారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


ఎమ్మెల్యేలు సబితారెడ్డి, యాదయ్యను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

చేవెళ్ల: మండలంలోని ఊరేళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం మూడోరోజు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు చేసి, నైవేద్యం సమర్పించారు. హోమాలు, పూజలతో ఊరేళ్ల గ్రామంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉండే ఆలయాలతో ప్రజలకు మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మండల పరిధి పలు పార్టీల నాయకులు వేరువేరుగా పూజలు చేశారు. గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, గ్రామస్తులు నాయకులను శాలువాలతో సన్మానించారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

ఐక్యతతోనే ఖ్యాతి

తాండూరు: ఐక్యతతోనే హిందువుల ఖ్యాతి పెరుగుతుందని తెలంగాణ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌స్వామిజీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో విశ్వహిందుపరిషత్ ఆధ్వర్యంలో జిల్లా ప్రాంత విభాగ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడారు. హిందూ ధర్మం కోసం పాటుపడే వారి వెంట నడుస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు బల్వంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా కార్యదర్శి శ్రీలతరెడ్డి, సాధుపరిషత్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో నూతనంగా నిర్మించిన కోట మైసమ్మ ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రథమ పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అనునిత్యం దైవచింతన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరారు. గ్రామానికి చెందిన ఆలయ నిర్మాణానికి సహకరించిన రవీందర్‌రెడ్డి కల్పన, శ్రీరాంరెడ్డి పద్మలత, లక్ష్మణ్‌రెడ్డి రేణుక దంపతులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. గ్రామ దేవతలను పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని, అమ్మవారి అనుగ్రహంతో గ్రామస్తులందరూ సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, నవాజ్‌రెడ్డి, సీతారాం, సత్యనారాయణ, తిరుపతి రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని భూమనంద నల్లా ఉపేంద్ర ఆర్యులు సూచించారు. మండల పరిధి గొల్లగూడ గ్రామంలో జరుగుతున్న సచ్చిదానంద సాయన్న ఆర్యుల 50వ స్వర్ణోత్సవం, సాందీప అచల ఋషి పరిపూర్ణ గురు మందిర వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి గురు మందిరంలో గురు మందిర వ్యవస్థాపకుడు దయానంద నాగుల వెంకటేశం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా భూమానంద నల్లా ఉపేంద్ర ఆర్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని భక్తిమార్గంలో నడవాలని కోరారు.

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి


జెడ్పీటీసీ మాలతి కృష్ణారెడ్డి దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రంజిత్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేద్దామని ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఆయన నివాసం వద్ద శుక్రవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీ మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి దంపతులు, వారి అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన బీంభరత్, ఎంపీ రంజిత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీకి బలమైన కేడర్ ఉందని, పార్టీకి చేవెళ్ల గడ్డ అడ్డాగా ఉంటూ వస్తోందని చెప్పారు. ఈ సారి కూడా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేసేందుకు అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. చేవెళ్ల గడ్డ నాకు రాజకీయం నేర్పించిందని, ఇక్కడి ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. పార్టీ నిరుపేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో మద్దెల జంగయ్య, సాయికుమార్, పొట్ట దయాకర్, జనార్దన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, ఆగిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మద్దెల శ్రీను, మల్లారెడ్డి, పెంటయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి 17 వరకు బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్: మండల పరిధి సురంగల్‌లో ఈ నెల 13 నుంచి 17 వరకు మల్లికార్జున స్వామి, బీరప్పస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మల్లికార్జునస్వామి మైలలు తీసే కార్యక్రమం నిర్వహించారు. 13న మల్లికార్జునస్వామి గంగ స్నానము, 14న స్వామి వారి కల్యాణోత్సవం, బోనాల ఊరేగింపు, శివసత్తుల అగ్నిగుండాలు తొక్కుట, ఉక్క గొలుసు తెంపుట కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 15న బీరప్పస్వామి గంగ స్నానము, బోనాల ఊరేగింపు, బీరప్ప కామరాతి దేవి లగ్నం, 16న నాగవెల్లి, 17న గడప కడుగుట కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు.

ఇసుక తోడేస్తున్నారు!

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


నాగర్‌గూడ ఈసీవాగు నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలింపు

షాబాద్: అక్రమార్కులకు ఈసీవాగు ఇసుక.. కాసుల పంటను పండిస్తోంది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా యథేచ్ఛగా నిత్యం ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతూనే ఉన్నది. అనుమతులు లేకుండా అధికారుల కనుసైగల్లో గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు ఇసుకను తరలిస్తున్నారు. ఎస్‌ఓటీ పోలీసులు ఇసుక వ్యాపారుల వద్ద మామూలు తీసుకొని ఇసుక ట్రాక్టర్లను వదిలిపెడుతున్నట్లు వివిధ పరిసర గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని ఎవరైనా ఫోన్ చేస్తే నేరుగా ఇసుక వ్యాపారులకు ఫోన్ చేసి ఫలానా వ్యక్తి ఫోన్ చేశాడని సమాచారం అందిస్తున్నారని, స్థానిక పోలీసులు కూడా ఇసుక వ్యాపారులకు సహకరిస్తున్నట్లు పేర్కొంటున్నారు. మండలంలో అక్రమ ఇసుక రవాణా జోరు సాగుతుండటంతో.. మండల పరిధిలోని పలు గ్రామాలు ఎడారులుగా మారుతున్నాయి. మండలంలోని ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ, తాళ్లపల్లి, నాగర్‌గూడ, రుద్రారం, చందనవెళ్లి, హైతాబాద్, సోలిపేట్ తదితర గ్రామాల మీదుగా ఈసీ వాగు ఉంది. గతంలో వాగునిండా ఇసుక ఉండడంతో చుట్టుపక్క గ్రామాలు, వాగు పరిసర ప్రాంతంలో పచ్చని చెట్లతోపాటు బోర్లలో నీరు పుష్కలంగా ఉండేది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వ్యవసాయాన్ని సాఫీగా చేసుకుంటూ జీవించేవారు. కానీ ప్రస్తుతం వాగులో నిండా ఉన్న ఇసుకకు బదులు పెద్ద పెద్ద గోతులతో పాటు ఎండిన పొలాలు ఎడారులను తలపిస్తున్నాయి. దీంతో దిక్కుతోచని రైతన్న బిక్కుబిక్కుమంటూ ఉన్న ఊళ్లో ఉపాధి దొరకక వలస బాట పడుతున్నాడు. ఇసుక రవాణాను ఆపకుంటే గ్రామాలు ఎడారులుగా మారడం ఖాయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాత్రిపూట అక్రమ దందా...

ఈసీ వాగులో నుంచి వ్యాపారులు రాత్రిపూట అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. వందల కొద్దీ ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రాక్టరు ఇసుకను ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న ప్రాంతానికి తరలిస్తే రూ.5 నుంచి 8వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం. అదే అదనుగా భావించిన కొందరు వ్యక్తులు ట్రాక్టర్లను కొనుగోలు చేసి మరీ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోంది. 2000 జనాభా గల గ్రామంలో 20 నుంచి 25 ట్రాక్టర్లు ఉన్నాయంటే పరిస్థితి అర్థమవుతోంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు..

అక్రమ ఇసుక రవాణా కొన సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. యథేచ్ఛగా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నా ఏమాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎవరైనా ఇసుక రవాణాపై అధికారులను ప్రశ్నిస్తే లిఖిత పూర్వకంగా తమకు రాసిస్తేనే చర్యలు తీసుకుంటామని, తమ దృష్టికి రానప్పుడు ఎలా చర్యలు తీసుకోవాలని ఎదురు ప్రశ్నిస్తున్నారని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎవరైనా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే.. అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో చూడాలి మరి..

కేసులు నమోదు చేస్తాం



ఈసీ వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తాం. నెల రోజుల క్రితం రెండు ట్రాక్టర్లను పట్టుకొని చలాన్‌లు వేశాం. ట్రాక్టర్లు వాగులో ఉన్నప్పుడు తమకు సమాచారం అందిస్తే వాటిని పట్టుకొని సీజ్ చేస్తాం. వాల్టా చట్టం కింద కేసు నమోదు చేస్తాం.

– మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ, షాబాద్

ఎవరికీ అనుమతి లేదు



అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తాం. వాహనాలను సీజ్ చేస్తాం. ప్రభుత్వ పనులకు, ప్రైవేట్ పనులకైనా ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతి ఇవ్వడం లేదు. రాత్రి పూట అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తెలిస్తే.. చర్యలు తీసుకుంటాం.

– ఎండీ అన్వర్, తహసీల్దార్, షాబాద్